గన్నేరుపూలు

'గిరి'

౧

ఆ క్లబ్బుకి ఆనివున్నతోట చాలాఅందమైంది; విశాలమైందిగూడా. గమ్మని సువాసనని విసిరే పూలమొక్కలూ, కళ్లకి ఆనందం కలిగించేరంగుల ఆకులక్రోటన్లూ దాంట్లో అనేకం. చక్కగా విశాలంగా పెరిగిన సరివిచెట్లగుంపుల గాఢమైననీడల్లో చాటుగా ప్రియులు కూచొని మాట్లాడుకోడానికి చిన్న చిన్న అరుగులు వున్నాయి అక్కడక్కడ. పచ్చని పొదల్ని పెద్దగా పెంచి వానినడుమ పెద్దహవుజులు కట్టారు. తెల్లనిజాతులు వాటితేటనీటిలో ఈదుతోంటాయి. ఆహవుజులచుట్టూవున్న మంచిరాళ్ల అరుగుమీద కూచొని హవుజునీళ్లలో చేతులాడించొచ్చు.

తీర్పుగావున్న ఆబాటలవెంబడి నడుస్తోంది వసుంధర. సరివిచెట్లసంపులోంచి కొంచెంకొంచెంగా అవుపడుతోన్నక్లబ్బుగదిలో ఆంగ్లయువతి వొహామె పియానోమీద "All I know is you are in my arms" అనేపాటని గొంతెత్తి పాడుతోంది. ఆ పాటని వింటో తనప్రియుడిని తన కవుగిట్లోఉన్నట్లు వూహించుకొని నడిచిపోతోంది వసుంధర.

ఆపూలతిరిగి నాలుగడుగులు ముందునడిచేవరకు కుడివేపుకున్న గన్నేరుచెట్టుపక్కన కాళ్లుచేతులు జాచి చతికలగా పడివున్నవొహయువకుడిఆకారం చప్పున ఆమెకంటికి అవుపడ్డది భయంకరంగా; కెవ్వుమన్నది. కాని దగ్గిరగా యెవరూ లేకుండటంవల్ల వినపళ్లా యొవరికీ. చీరచింగులు సవరించింది పరుగెత్తడానికి. కాని ఆముహూర్తాన్నే అలాఅశక్తుడైపడివున్నవ్యక్తి తనని యేమీచేయలేడనేధైర్యం వొచ్చింది. అట్లాగే దూరంగానుంచొని నిదానించి చూసింది. డజన్కన్నా యెక్కువతొ్ట్లలుండి, చేతులు సగంవరకు చినిగిపోయిన సిపాయివాళ్లకో టొహటి తొడుక్కున్నాడు. చెమట చేత మాసి, చూస్తేనే అసహ్యంవొచ్చే మురికిషర్టు వొహటి తొడుక్కున్నాడు లోపల. మురికిలో షర్టుకి యేమాత్రం తీసిపోని ధోతి గూడకట్టుకట్టాడు అరవవాళ్లమాదిరి. ఆగుడ్డపేలికలు ఆదేహంమీదవున్నాయన్న మాటేగాని యేవుద్దేశంచేతనైతే గుడ్డలు ధరిస్తామో అది అట్లానే వుంది. షర్టూ అవీ తొలిగిపోయి యేమాత్రం శ్రద్ధలేక మురికిగావున్నదేహం అవుపడ్తో ఆడవాళ్లకేమిటి మొగాళ్లకే సిగ్గుగలిగిస్తోంది. ఆతనిస్థితి చూసి వసుంధరకి పాపమనిపించింది. కాలేజికుఱ్ఱాళ్లు వొచ్చి ఆతన్ని పరిహాసంచేస్తారని ధైర్యంగా దగ్గిరికెళ్లి తొలిగిపోయినగుడ్డని సరిచేసింది. అలా కిందికివొంగి నప్పుడు సారాయివాసన గప్పున విసిరింది. ఆతనిముఖం వేపు చూసింది. అసహ్యంగాపెరిగినగడ్డం, వుంగరాలుగా మెలికలుతిరిగిన తలవెంట్రుకలు, ఆతీర్చినకనుబొమ్మలు, చక్కనిముక్కు, ఆమెకు మరీజాలిని కలిగించాయి. ముప్ఫైయేళ్లన్నా రాకముందే యీ యువకుడు యిట్లా పాడైతే తక్కినజీవితమంతా యెట్లాగడవాలి పాపం అనుకుంది.

ఆమె వెడ్తో వెనక్కి తిరిగి చూసింది. ఆతడు లేచి వెనక్కి చేతులమీద ఆనుకొని కూచున్నాడు. వీలైతే సంగతేమిటో తెలుసుకుందామని వెళ్లి దూరంగా నుంచుంది. ఒకనిమిషం ఆత డామెని యెగాదిగా చూసి చేతులుజాచి "తారా, తారా" అని అరుస్తో లేవబోయాడు. కాని కాళ్లు తడబడి పడిపోయాడు. అట్లాగే కూచొని మళ్లీ ఆమెను పరీక్షగాచూసి, "కాదు, కాదు, నువ్వుకావు నాతారవి. పో, పో" అని చేతిని విసిరి చేతుల్లో తలదాచుకొని భోరున యేడ్చాడు చుట్టుపక్కలంతా మారుమ్రోగేటట్టు. "ఎవరునువ్వు?" అని వసుంధర అడిగింది. వినపళ్లేదేమో అని ముందుకి వొంగి గట్టిగా అడిగింది, మూడు సార్లు అదేప్రశ్నని. ఐనా ఆతడు జవాబు చెప్పలా. తల

పైకెత్తి చూడసైతంచూళ్లా. లాభం లేదని వసుంధర వెనక్కి తిరిగి తన యింటివేపు వెళ్లింది. దారిపొడుగు నంతా ఆదృశ్యాన్నే పునఃస్మరించు కుంది. చివరకి యింటిగుమ్మంచేరిన తరువాత దీర్ఘంగా నిట్టూర్పువిడిచి, "యిట్లాయెన్ని జీవితాలు సారాయికి బలిఅవుతోన్నాయో" అంది.

౨

సాయంత్రం నాలుగు గంటలకి స్కూలునుంచివొచ్చి రోజంతా అరవడంచేత డస్సిపోయి యీజీచేరులో పడిపోయింది వసుంధర. కళ్లుమూసుకొని అయిదునిమిషాలు నిశ్చలనంగా కూచుంది. పనిమనిషి వొచ్చి "టీ చల్లారిపోతోంది." అంటే మళ్లీ యీప్రపంచం జ్ఞాపకం వొచ్చిందామెకి. మెల్లిగా లేచి లోపలి కెళ్లి ముఖం కడుక్కుంది. చీరా, జేకట్టును మార్చి తలసరిచేసుకొని టీ త్రాగింది. టెన్నిస్ రాకెట్ కోసం కిటికీకి సమీపంలో వున్న టేబిల్ దగ్గిరి కెళ్లింది. కిటికీకి సమీపంగా టేబిల్ మీద తెల్లగన్నేరు పూలగుచ్ఛ వుంది. ఏమాత్రంవాడక నిగనిగలాడుతోన్నాయి పూలు. పనిమనిషిని పిలిచి, "యీపూ లెందుకు పెట్టావు యిక్కడ?" అని అడిగింది. వాటివిషయమే తనకు తెలీదంది పనిమనిషి. వసుంధర వాటిని కిటికీలోంచి విసిరిపారేసింది.

మరునాడు స్కూలునుంచి వొచ్చేగావటంతోటే గదిలోకెళ్లి టేబిల్ వేపు చూసింది. మళ్లీ నిగనిగలాడేగన్నేరుపూలగుచ్ఛ ! ఆమెకి ఆశ్చర్యమేసింది యీపూలగాథ యేమిటని ? అవి గన్నేరుపూలుగాక యేగులాబిపూలో ఐతే కథవూహించుకోడం యింతకష్టంకాదామెకి. పైగాగర్వపడేదికూడా వోహకొత్తరాజ్యాన్ని వశపరుచుకున్న రాజుకు మల్లే. కాని యీగన్నేరుపూలఅర్థం కంగారుపరిచిందామెని. ఆమరుసటిదినం ఆదివారంకదా, ఆరసికు డెవరో కనుక్కుందా మనుకొంది.

ఆదివారం మధ్యాన్నం పదకొండుటికల్లా భోంచేసి ఆ కిటికీకి యెదురుగా బాగా అవుపడేటట్టు మంచం వేసుకొని పడుకుంది. ఆ కిటికీబైట ఆ రసికుడి ఆకారం అవుపడ్డంతోటే కళ్లు కాస్త మూసికొని నిద్రపోతోన్నట్టు



"ఆ పూలని టేబిల్ మీద పెట్టి

నటించాలని ఆమెయెత్తు. ఆమె మోహపాశాల్లోపరితపిస్తోన్న ఆప్రియుడు లోపలికి చూస్తో ఆకిటికీదగ్గిరనుంచుంటే, నిద్రపోతోన్న సౌందర్యదేవతలా మంచంమీద తను అవుపడితే, ఆతనిహృదయంమీద కలిగేపరిణామం యేమిటో ఆమె యిదివరకే వూహించింది. అప్పుడే ఆతని మనోవికారాన్ని గమనించటానికి బాగా వీలుంటుందని ఆమెఆలోచన తనఆకారం మిగులఆకర్షణీయంగా వుండేటట్టు పల్చనిగులాబివన్నె చీరకట్టుకొని తెల్లనిపరుపులో కుచ్చుగవుసెన్ల తలగడలమీద ఆ నల్లనివెంద్రుకలు కుప్పగా పడివుంటే మధ్య కమలంలాంటి తన లేమోమును అమర్చింది. వేస్టుకోటువంటి చేతులు లేని రవికలోంచి



ధైర్యంచేసి లోపలికి తొంగిచూస్తాడు మెల్లిగా."

వెడలిన ఆనిడుపైన చేతిముందుభాగం మంచంపైనుంచి కిందికి వ్రేలాడుతో పొడువైన ఆసన్నని వేళ్ల మోజుని మరీ అధికపరుస్తోంది. తక్కినవన్నీ అలావుంచి వొహకాలిపై కాస్త వంకరగాముడిచిన రెండో మోకాలూ, ఆనడుము పక్కన ఆపొంక మైనయెత్తూహృదయాన్ని కొట్టుకు నేట్టు చేస్తాయి. ఊర్వశిని చూడకుండానే ఆమెవర్ణనతో వందలకొద్దీ పేజీలు నింపినపెద్దనగనక ఆముహూర్తాన ఆ కిటికీ దగ్గిర వుండడమే తటస్థిస్తే 'వసుంధరవర్ణనం' అనే గ్రంథాన్ని రచిస్తో అక్కడే వుండిపోయేవాడు ఆకృష్ణ దేవరాయలుకూడా జ్ఞాపకం లేకుండా.

ఒకాటీ, రెండూ, మూడూ గడచిపోయాయి. విసుగెత్తింది. ఎంతసేపని అలా పోజు యిస్తుంది! ఇహ లేతామనుకు నేవరకు కిటికీకుడిచేరెడిపక్కన గన్నేరు పూలగుచ్ఛ అవుపడ్డది. ఆమెహృదయం కొట్టుకుంది. కళ్లు సన్నగా తెరిచివుంచింది. క్రమంగా ఆగుచ్ఛ ముందుకి జరిగింది. కిటికీలోకి దూరింది. దాన్ని పట్టుకున్న పిడికిలికూడా అవుపడ్డది. ఆచేయి ముందుకి జరిగి ఆ గుచ్ఛని టేబిల్ మీద పెట్టింది. ఆచేతిమురికివర్టూ, దానికిమీద మోచేతిదగ్గిర వ్రేలాడే చినిగినసిపాయి కోటూ, ఆమె కప్పుడే తెలిపాయి ఆచేయి యెవరిదో. ఈపిచ్చివాడింకా యేంచేస్తాడో చూడదలుచుకుంది ఎవరో తాను సొంతంగా రాధైర్యం లేక యీతనిపిచ్చి వల్ల లాభం పొందుతోన్నారని వూహించగలిగింది.

ఆపూలని టేబిల్ మీదపెట్టి ధైర్యంచేసి లోపలికి తొంగిచూస్తాడు మెల్లిగా. ఆమెనిచూసి ముగ్ధుడైపోయాడు. పూర్తిగా కిటికీముందుకి వొచ్చి కిటికీకడపని పట్టుకొని ఆమెవేపు నిదానంగా చూస్తోనుంచున్నాడు. తానలా చూస్తోన్నది దొంగతనంగా ననే విషయమే జ్ఞాపకం లేదాతనికి. అట్లాగే నుంచున్నాడు. కళ్లెంబడి నీళ్లు వరదలుకట్టి కడపమీద పడుతోన్నాయి.

పది, యిరవై, ముప్పై నిమిషాలు గడిచిపోయాయి. చిత్రంలోని బొమ్మలాగా అట్లాగే నుంచున్నాడు యేమాత్రం చలనంలేక. కళ్లెంబడి నీళ్లు అట్లాగే యేకధారగా కారుతో కిటికీలో మడుగు కట్టాయి. ఇదంతేమీ అర్థంకాలా వసుంధరకి. ఏదో త్రాగుడుకోసం నాలుగుడబ్బుల కాసించి తెచ్చినగన్నేరుపూలని అలా పడేసి వెళ్లిపోక అతను ఆవిధంగా అర్ధగంటనుంచి కదలకుండా నుంచోడం, దాంట్లో యేకధారగా కంటినీరు కారుస్తో నుంచోటం ఆమెని గాభరాపెట్టాయి. అదివరకుండిన తుంటరితనం, ధైర్యం వొక్కముహూర్తాన కరిగిపోయాయి. చప్పున లేచి ఆతన్ని పట్టుకొని చెంపలు వాయించటానికిగాని, చివరకి చీవాట్లు పెట్టడానికిగాని ధైర్యం లేకపోయిందామెకి. ముందే పిచ్చివాడు, దాంట్లో త్రాగుబోతుకూడా. ఏంమోటుతనం చేస్తాడో అని భయమేసింది. ఎట్లాగైనా వాడు వెళ్లిపోతే చాలనిపించింది.

కదిలింది కాస్త. ఐనా వెళ్లలా వాడు. మెలకువవుతోన్నదాని మళ్లే వొళ్లు విరిచింది. కదల్లా వాడు. దగ్గింది. తలగూడా తిప్పలా వాడు. ఇంకా యెంతసేపని పడుకుంటుందిమరి? కళ్లు నలుపుకుంటో లేచి కూచుంది. చేతులు జోడించి ఆమెకేసి భక్తిగా చూస్తో నుంచున్నాడు, ప్రత్యక్షమవుతోన్న దేవుడివేపు భక్తుడు చూస్తో నుంచున్నట్టు. కళ్లెంబడి నీళ్లు కారుతూనేవున్నాయి. ఏమో అనబోతాడు. కాని పెదిమలు తడబడతాయి. వసుంధర లేచి నుంచొని అప్పుడే ఆతన్ని చూసినట్టు చూసింది కోపంగా. వాడు మరీ భక్తితో చూస్తోన్నాడు. "ఎవరునువ్వు" అని గద్దించి అడిగింది. తొట్రుపడుతో పెదిమలగుండా అస్పష్టకంఠంతో "తార, తార" అన్నాడు రెండుసార్లు. ఆమె వాడిదగ్గిర కెళ్లి ఆపూలని వాడిముఖంమీద విసిరి, "ఎవరుచెప్పారు నీకు యీ పూలని యిక్కడ యివ్వాలని?" అని అడిగింది పోలీసుయిన్స్పెక్టరు దొంగని అడిగినట్టు. ఆమెప్రశ్న వినబడనట్టే ధ్వని లేకుండా ఆమెవేపుచూస్తో పెదిమలతో "తార, తార," అంటోన్నాడు. "చెప్పు. లేకపోతే చంపేస్తా"నంది పళ్లు బిగబట్టి. ఐనా అదేజపం వాడిది. ఛీ, వీడితో లాభంలేదని, "వెళ్లు. వెళ్లిపో. మళ్లీ వొచ్చావంటే చస్తా"వని గట్టిగా అరుస్తో వెళ్లమని చేత్తో సంజ్ఞ చేసింది.

మెల్లిగా తరిలాడు ఆమెవేపుచూస్తోనే. వాడు నాలుగు అడుగులు నడవటంతోటే చప్పున కిటికీ మూసేసింది.

3

స్కూలువాళ్లంతా కలిసి ఆఆదివారం పిక్ని(Picnic)క్కి వెళ్లారు, ఆవూరికి చాలాదూరంలో మనుషులెవరూ వెళ్లనివేపుకి. విశాలమైన నదివొహటి పారుతుంది. దానిరెండువొడ్డులకి దట్టమైన అడివి. ఆఅడవిని యింకా పెద్దగా దట్టంగా పెంచాలనేవుద్దేశంతో కొట్టనీటంలేదు. సంవత్సరానికి వొహటి రెండుతడవల యిన్స్పెక్షన్కి వొచ్చేఫారెస్టుఆఫీసర్లుతప్ప యెవరూ పోరు దాంట్లోకి. ఆపెద్దయిసుకలో విడిసారు యీపార్టీవాళ్లు. నాగరికబంధాలూ, సంఘం తెచ్చిపెట్టిన మన్నన, మర్యాద, సిగ్గూ అన్నిటినీ ఆనాటికోసం వొహమూల కట్టిపెట్టి, అంతా మరిచి ప్రపంచాన్నెరుగని పసిపిల్లల్లాగా ఆనందిస్తోన్నారు. వూరికే కిలకిలమని నవ్వుతోన్నారు, మాటిమాటికి నవ్వటం అసభ్యత్వం అని తోడివారనిపోతారేమో అనేభయం యేమాత్రం లేకుండా. తమగదిలో వొంటరిగావున్నప్పుడుగూడా పారుసువాళ్లింటే గాడిదస్వరం అనిపోతారేమో అనేజంకుతో గొంతెత్తి యెరుగనివాళ్లు కూడా ఆచెట్లూ, గుట్టలూ ప్రతిధ్వనించేటట్టు పాడుతోన్నారు. లోతు లేక సన్ననియిసుకలో నిమ్మళంగా ప్రవహించే ఆస్వచ్ఛమైననీటిలో బుటకలుకొడుతోన్నారు కొందరు. కొంద రాచెట్లగుంపుల్లో దాగుడుమూత లాడుతోన్నారు.

వసుంధర, యింకాయిద్దరుస్నేహితుల్తో జుట్టుముడి విప్పేసి గుడ్డల్ని వొదిలేసి వెన్నెల్లాంటిదేహాల్తో వనదేవతల్లాగా ఆపాదలగుండా పందాలుకట్టుకో పరుగెత్తుతోన్నారు. డస్సిపోయినా కొద్ది నవ్వుతోన్నారు. వాళ్లంతా చెమటలు పెట్టినా పట్టుదలగా పరుగెత్తుతోనే వున్నారు. కొద్దిగా యెత్తుగావున్న గుండ్లసమూహమొహటి కొంతదూరాన అవుపడ్డది. అక్కడికి పరుగెత్తి స్వచ్ఛమైనగాలికి ఆయెత్తుగుండ్లమీద పక్షుల్లాగా కొంతసేపు కూచొని విశ్రాంతిబొందాలనుకున్నారు. ఆవేపు పరుగెత్తారు. వసుంధరకాలికి యేదో వొత్తుకోపోతే వెనక్కివుంది కాస్త. తక్కినయిద్దరు ఆగుట్టమీదికి ముందుగా పరుగెత్తి వొహగుండుని ప్రాకారు. ఆవలివేపేదో కనబడ్డది. ఇద్దరూ గబాలిన వెనక్కిదుమికారు. అర్థగంటనుంచి మరిచిపోయినప్రపంచం, సిగ్గూ చప్పున వాళ్లని అల్లుకున్నాయి మళ్లీ. దేహాన్నంతా వీలైనంతవరకు దెగ్గిరకి ముడుచుకొని వొంగి వసుంధరకి యెదురుగా పరుగెత్తి ఆమెమెడకి వ్రేలాడపడి నవ్వుకున్నారు. ఆగుండువేపుచూపుతో నవ్వుతారేకాని అసలువిషయ మేమిటో చెప్పరు. ఐనా ఆవే పేదో వుందనిమాత్రం వూహించింది వసుంధర. కాలేజికుఱ్ఱాళ్ల పార్టీ వుందనుకుంది. వెనక్కితిరిగి మళ్లీ పరుగెత్తడానికి వుంకించింది. కాని వాళ్లిద్దరూ "నువ్వుచూడు, నువ్వుచూడు" అంటో ఆమెని పట్టుకో బలవంతాన గుండువేపు లాగారు. గుండు నెక్కించారు. విధిలేక మెల్లిగా ఆవలివేపు తొంగిచూసింది. ఆమురికిసిపాయికోటు, తోలులాంటి అరవధోతి! బోర్లింతగా పడుకొని మోచేతుల మీద ఆనుకున్నాడు. ఆతనిచుట్టు నాలుగువేపులా నాలుగు విశాలమైనగుండ్లువుండి కప్పులేని గదిలాగుంది ఆప్రదేశం. అలా బోర్లపడుకున్నాతనిముందు బండమీద బొగ్గుతో రాసిన ఆడబొమ్మ వొహటుంది. ఆబొమ్మ బొగ్గుతో బండమీద రాయబడ్డా అచ్చంఫోటోమల్లే రూపురేఖల్తో వుండి జీవకళతో వుట్టిపడుతో చిత్రకారుడినైపుణ్యాన్ని చాటుతోంది. ఆబొమ్మకాళ్ల దెగ్గెర పచ్చిరేగటిమట్టిగద్దెమీద రతనాల్లాంటి యెఱ్ఱనిగురిగింజల్తో, "తార" అని యింగ్లీషులో నాలుగుఅక్షరాలు పొంకంగా కూర్చాడు. ఆపేరుకింద ఆగురిగింజల్తోనే యింకా యేమో పేరుస్తోన్నాడు. ఆమెతోగూడా అట్లానే వొంగి తొంగిచూస్తోన్న యిద్దరు ఆగుట్టలన్నీ యెగిరిపోయేటట్టు నవ్వారు. వసుంధర చప్పున వెనక్కి దూకింది. వాళ్లిద్దరుకూడా ఆమె దెగ్గిరకి వొచ్చి ఆపిచ్చివాడితో తమాషాచేద్దామన్నారు. వసుంధరకి మనసొప్పలేదు. వొద్దంది.

"మొగాళ్లకి యెవరూ లేనిప్రదేశంలో అందమైనఆడది అవుపడితే యేంచేస్తారో మనకేం తెలుసు! మనం యీవెఘవని చూసి భ్రమపడ్డామని కాదు. వాడు

మనల్ని యిలాచూస్తే యేంచేస్తాడో, యేం అనుకుంటాడో చూద్దాం." అంది ఆఅమెరికాయువతి.

"వాడేమైనా మోటుగా ప్రవర్తించవుద్యుక్తుడైతే మనంముగ్గురం కలిసి వాడిని చావమోదం?" అంది మరొకామె.

అంతసాహసం లేదు వసుంధరకి, వుత్తమాటలే కాని. అలా గుడ్డలులేక పట్టపగలు పరుగెత్తడాని గ్గూడా ధైర్యం లేకపోయింది. కాని యీదేశం వాళ్లంతా పిరికిపందలని తక్కినవాళ్లు తిడతారని మొండిధైర్యం చేసింది. ఇలా వాడికి అవుపడడమేకాక వాడిని రేగించటం తలుచుకుంటేనే గుండె లదిరిపోయాయి. వాళ్లకి యిట్లాంటివి లక్ష్యం లేదు. తమలాగా చదువుకొని నాగరికు లనిపించుకునే మొగాళ్లే మొగాళ్లని వాళ్ల భావం. తక్కినవాళ్లు మనుషుల్ని యేమీచేయలేని మొగజంతువులు వాళ్లదృష్టిలో. రోముదేశపు చక్రవర్తి నీరోభార్యలు, నపుంసకులనిసైతం తపింపచేసే యవ్వనం కలవాళ్లు, నిరభ్యంతరంగా తమసేవకులముందు స్నానాలుచేసేవాళ్లట. ఈపిచ్చివాడంటే వోహాలక్ష్యమా వాళ్లకి! అందుచేతే ఆఅల్లరికి బూనుకున్నారు. వాళ్లిద్దరూ మళ్లీ ఆ గుండెక్కి వాడికి పూర్తిగా అవుపడేట్టు నుంచొని పెద్దగా అరిచారు. వెంటనే "వొస్తోన్నాడు" అంటో వెనక్కిదూకి చిన్న గుండువెనక దాగున్నారు. వసుంధర వోహాపొదవెనక దాగుంది. చుట్టుపక్కలంతా వినపడేట్టు నవ్వుతో వాడు లోపల్నుంచి యెక్కివొచ్చాడు. ఇంకా వాడు గుండు మీదవుండి నవ్వుతో చుట్టూ చూస్తోండగనే వసుంధరముఖం ఆపల్చని పొదలోంచి అవుపడ్డది. ఆతని ముఖంలోని ఆనవ్వు, ఆ ఆనందం మెరుపుమల్లే మాయమయాయి. చేతులు వొదిలి కిందికి పడిపోయాడు. ఏకదృష్టిగా ఆపొదవేపు చూస్తో అమాంతంగా లేచి దెబ్బతగిలి మోకాలినుంచి కారేనెత్తురునికూడా లెక్కపెట్టక ఆపొదవేపు రెండడుగులు నడిచాడు. పక్కగుండు వెనకనుంచి "నువ్వే కావాలట వసుంధర" అని వాళ్లు నవ్వుతో అరుస్తోన్నారు. కాని అవి వాడిచెవిని సోకినట్టు లేదు. బాగా అవుపడ్డ దాతనికి వసుంధర. వాడక్కడే ఆగి తనకోటుని విప్పి ఆపొదలోకి విసిరి, "చలి, చలి. తొడుక్కోతార" అంటో యేడ్చాడు. తనకిటికీదగ్గిరి దృశ్యం జ్ఞాపకంవొచ్చింది వసుంధరకి. ధైర్యం వొచ్చింది. గొంతు సవరించుకొని చేతిని సాచి "వెళ్లు వెళ్లు. తొరగా వెళ్లిపో" అంది. కదిలాడు వాడు. వెనక్కి తిరిగిచూస్తో మెల్లి మెల్లిగాఆమెచూపించిన వేపు నడిచిపోయాడు, ఆడుకుంటోన్న తక్కిన పిల్లలవేపుచూస్తో విధిలేక బడిపంతులుముందు నడిచిపోయే పిల్లవాడిలాగా. ఆపేగులపుర్టుని తొడుక్కొని నడువలేక దరిద్రనారాయణుడిలాగా కదిలిపోతోన్న వాడి దీనమైనముఖం, భక్తియుక్తమైనచూపులూ వెనక్కి ఆమెవేపు తలని తిప్పినప్పుడల్లా వసుంధరకి వోహవిధంగా జాలిని కలిగించాయి. దుఃఖమనిపించింది. వెనకాలే పరుగెత్తి ఆకోటాతనికి తొడిగి బుజ్జగించి పంపా లనిపించింది. దట్టమైనపొదలు కొన్ని అడ్డమై ఆతన్ని అవుపడకుండ చేసాయి.

వాడు వెళ్లిపోవటంతోటే గుండువెనకాల్నుంచి వాళ్లిద్దరూ పరుగెత్తుకోవచ్చారు. "వొక్కనిమిషంలో నీప్రియుడిని కుక్కనుచేసేసావే!" అని బహూకరించింది అమెరికాయువతి. "తొడుక్కోవుమరికోటును అంతప్రేమగా వాడిస్తే?" అని నవ్వింది మరొకామె.

వాడినగరులో యేముందో చూద్దామన్నారు. వాళ్లిద్దరు ముందు వెళ్లారు. వాళ్లవెనక మెల్లిగా వెళ్లింది వసుంధర. ఆబండమీద చిత్రించిన ఆబొమ్మను చూసేచూట్టంతోటే వాళ్లిద్దరు వసుంధరని ముందుకి లాగి "హా! వసుంధరా!" అని అరిచారు. అంతకొంటెస్వభావంకలవాళ్లిద్దరుకూడా ఆముహూర్తాన పరివర్తనబొందారు. నవ్వు మానేసి సీరియస్‌గా ఆబొమ్మని పరీక్షించారు. ప్రాణం వుట్టిపడుతోంది. ఆమురికిబండమీద బొగ్గుతో యింతనిపుణంగా యెలారాయకలిగాడా అని ఆశ్చర్యపడ్డారు. వసుంధరని యెదురుగా కూచోపెట్టుకొని నిపుణుడైన చిత్రకారుడు చిత్రించినబొమ్మలాగుంది. కాని కొన్నిపోలికలు, వెంట్రుకలు, కను

బొమ్మలు మాత్రం వసుంధరవి కావు. ఇంకా యేముందో అని వెతికారు. వోహమూల రెండు గుండ్లమధ్య యిరుకుసందులో యెండిపోయిన తెల్లగన్నేరు పూలరాశీ, గన్నేరుకొమ్మలూ వున్నాయి. వాటి కింద అద్దమంతా తుత్తునుకలైపోయిన ఫోటో వొహటుంది. దాన్ని బైటికితీసింది అమెరికాయువతి. ఆబండమీద రాసినబొమ్మే దాంట్లో వుంది. ఆఫోటోను చూసే ఆబొమ్మని రాసాడు. వసుంధరని మిక్కిలి దగ్గిరగా పోలే వుంకొహామెది ఆఫోటో. ఎవరూ మాట్లాడకుండా దాన్ని పరీక్షించారు. దాన్ని అక్కడే పడేసి వాళ్లు వెడ్తోంటే ఆ ఫోటోను మళ్లీయెప్పటిమల్లే పూలకిందవుంచింది వసుంధర.

౪

ఆనాడు సాయంత్రం సరిగ్గా నాలుగుగంటలకి పెద్ద వర్షం కురిసింది. అందుచేత టెన్నీసుకి వెళ్లటానికి వీల్లేక తన గదిలో గ్రామఫోను పెట్టి సామాను పెట్టెలుసరుదుకుంటోంది వసుంధర. ఇహ రెండు రోజులుమాత్రమేవుందికొత్తవూరువెళ్లి ఛార్జీపుచ్చుకోటానికి. ఆ కొత్తవూళ్లో, కొత్తనాకట్లో, కొత్తసాకర్లూ, కొత్త స్నేహితులమధ్య స్థిరపడ్డానికి యెంతో యత్నం కావాలి. ఎన్నాళ్లో పడుతుంది. నిజంగా వోహవూరినుంచి వుంకొవూరికి

"ఎవరూ మాట్లాడకుండా దాన్ని పరీక్షించారు."

మారటమంటేయెంత అసహ్యమో అనుభవానికొ స్తేకాని తెలీదు.

పనిమనిషివొచ్చి, "మీకోసం యెవరో ముసలామే, చిన్నకుఱ్ఱాడూ వొచ్చా" రంది. గ్రామ ఫోన్‌ను ఆపి వాళ్లున్నగదిలో కెళ్లింది. తలుపు దగ్గిరే నుంచుం దామె యెడమచేతులో అబ్బాయిని పట్టుకో. ఆఅబ్బాయి వసుంధరకి తెలుసు. కృష్ణమూర్తి. ఆమెక్లాసులోనే చదువుతాడు. ఐదేళ్లుంటాయి. చాలా తెలివికలవాడేకాక ముద్దుకుఱ్ఱాడుకూడా. వసుంధరని చూడ్డంతోటే ఆముసలమ్మని ముందుకి లాక్కొవొచ్చాడు. అరవైయేళ్లుంటాయి దాదాపు ఆముసలమ్మకి. కళ్లు కాస్తమబ్బు. దగ్గిరికొస్తేనేకాని బాగా చూళ్లేదు. పూర్తిగా తెల్లబారినఆసిగ, పండుతమలపాకులాంటిదేహం చూసేవాళ్లకి పూజ్యభావం కలిగిస్తాయి. వసుంధర వాళ్లని కూర్చోపెట్టి ఆమె దగ్గిరగా కూచుంది. ఆముసలమ్మ వసుంధరని దగ్గిరగా పరీక్షించి చూసి నోరు తెరిచింది. పటపట నీళ్లు కారాయి కళ్లల్లోనుంచి. పైటలో ముఖం దాచుకొని వెక్కి వెక్కి యేడ్చింది. వసుంధరకి దీనిఅర్థం తెలీక వూరికే చూసింది. ఏదో కష్టంలో వుంది పెద్దమనిషి అనిమాత్రం వూహించింది. "ఎందుకమ్మా యేడుస్తావు?" అని దయగా అడిగింది. ఆముసలమ్మ తల పైకెత్తలా. ఐదునిమిషాలు మాట్లాడకుండా కూచుంది వసుంధర. ఆఅబ్బాయి ఆముసలమ్మని బుజ్జగించాడు. చివరకామె వొస్తోన్నదుఃఖాన్ని అణుచుకొని కళ్లనీళ్లు తుడుచుకుంటో, "మీక్లాసులోనేనటమ్మా మాఅబ్బాయి చదువుతోంది?" అంది.

"అవును."

"మీగురించి గంటలాతరువాయి చెప్తుతోంటాడు వీడు. మీరంటే వాడికి చాలాగురి."

"మీఅబ్బాయి చాలా తెలివిగలవాడులెండి. చాలచురుకు."

"వీడిమాటల్ని యీఆరునెల్లనుంచీ విని మిమ్మల్ని బాగా అర్థంచేసుకోకలిగా. నిండువిశ్వాసం కలిగింది. అందుచేతే యీసాయంత్రం ధైర్యంగా వొచ్చా."

"ఏమిటో చెప్పండి."

"ఈఅబ్బాయి నాకూతురికొడుకు."

"అలాగా?"

తుఫానులాగా వొచ్చేదుఃఖాన్ని గొంతులో అణిచి, "వీడిపుట్టుకతోటే అది పోయింది, ఆరేళ్లకింద."

"పాపం."

"తండ్రి—"అణుచుకున్నదుఃఖం ఆగిందికాదు. ఏడ్చింది.

"తండ్రికూడా పోయాడా పాపం?"

"పోయాడన్నమాటే వొహవిధంగా."

"అలాఅంటే?"

"నాకూతురూ, ఆతనూ సుఖంగా, దేవుడు వోర్వలేనంతప్రేమగా బతికారు పెళ్లయినమూడేళ్లు. అప్పుడాతను గొప్ప చిత్రకారుడు. ఆతనిబొమ్మల్ని విదేశీయులు వేలకువేలిచ్చి కొన్నారు. ఆదంపతులిద్దరూ చకోరపక్షుల్లాగా వొహరికోసం వొహరు బతికారు. అది—అదిచచ్చినవారంలోనే పిచ్చి యెత్తింది. హా! ఆదైవం తొందరగా వాడికళ్లు మూస్తే ఆకష్టాలు పొస్తాయి."

"బతికున్నాడా యిప్పుడు?"

ఏడుస్తో అవునని తల వూగించింది.

చెప్పరానిహృదయవేదనేదో కలిగింది వసుంధరకి. "మీకూతురిపేరేమిటి?"

పలుకలేక కష్టంతో "తార."

"తారా?"

మళ్లీ తలవూగించింది అవునన్నట్టు.

అర్థమైంది. అంతా అర్థమైంది వసుంధరకి. ఆపిచ్చివాడి "తార" జపానికి అర్థం యిప్పుడు తెలి

సింది. హృదయం కరుణతో నిండిపోయింది. "ఆత నిప్పుడు యెక్కడుంటాడు?" అని అడిగింది.

"అంతటా. చూసినవాళ్లు చెప్తారు అప్పుడప్పుడు అవుపడ్తాడట, తెల్లగన్నేరుచెట్లు యెక్కడుంటే అక్కడ". ఏడుస్తూ "తెల్లగన్నేరంటే అమితమైన ప్రేమ ఆతనికి. పెళ్లాన్ని రోజూ తల్లో ఆ పువ్వొహటి పెట్టుకోమనేవాడు." తరువాత పలుకలేకపోయింది. ఆగాధంతా జ్ఞాపకం వొచ్చి పైటలో తలదాచుకొని యేడవడం ఆరంభించింది. తన ఆలోచనల్లో తాను మునిగి వొదార్చడానిగ్గూడా అశక్తురాలైంది వసుంధర. ఇద్దరూ ఐదునిమిషాలదాక మాట్లాళ్లేదు. కృష్ణమూర్తి కడపమీద కూచొని దారి పొడుగుతా వొచ్చిపొయ్యేవాళ్లని చూస్తొన్నాడు. ఆనిశ్శబ్దాన్ని భంగపరిచింది ముసలమ్మ, "వీడికి నేను తప్ప యింకెవరూ లేరు దగ్గిరతీయటానికి." కాస్తసేపాగి, "రేపోమాపో నేను రాలిపోతే వీణ్ణి కన్నెత్తి చూసేవాళ్లుకూడా వుండరు."

ఆమెవేపు చూసింది వసుంధర.

"నేనిప్పుడు మీదగ్గిరకి రావటానికి ముఖ్య కారణం యీఅబ్బాయిని మీచేతుల్లో పెట్టి యేచింతా లేకుండా మృత్యువుకోసం యెదురుచూస్తూ కూచోవాలని. నాకు తెలుసు మీకీవార్త పిడుగులావుంటుందని. ఇప్పుడే జవాబు చెప్పాలిసినఅవసరం లేదు. రేపు సాయంత్రందాకా ఆలోచించండి. ఎట్లాగైనా వీడిని మనిషినిచేసేభారం మీది. మీరు వొప్పుకుంటే వీడి తల్లిదండ్రికి సంబంధించినపదివేలనగలూ, నోట్లూ, తెచ్చి మీకు వొప్పచెప్తా."

నిజంగా యిది వసుంధరమీద పిడుగులాగా పడ్డది. లేచి యేమో అనబోయింది కాని యింతట్లో ఆమెతోపాటు స్కూల్లో పనిచేసే స్నేహితురాలొహామె వొచ్చింది. ముసలమ్మ అబ్బాయిని చేతులో పట్టుకొని వెళ్లిపోతో తలుపుదగ్గిర నుంచున్నవసుంధరముఖాన్ని పరీక్షగా చూసి మళ్లీ యేడవటం ఆరంభించింది. "ఎందు కట్లా యేడుస్తావమ్మా, యేడవకు" అంది వసుంధర. "నాతార నాకళ్ల ముందు యీచేతుల్లో చావకపోతే మిమ్మల్ని చూట్టంతోటే "తారా" అని మెడకి పడేదాన్ని" అని కళ్ల నీళ్లు తుడుచుకుంటో వెళ్లిపోయింది.

వసుంధర స్నేహితురాలితో మాట్లాడక స్టూలు పైని గుడ్డవేపు చూస్తో ఆలోచిస్తోంది దీర్ఘంగా. ఆ స్నేహితురాలంది "ఎవరు వసుంధరా, ఆఅబ్బాయి? ఆపెదిమలూ, ఆచిన్నిగదవ అవి నీవే. నిన్ను చూసినవాళ్లు ఆతను నీకొడుకే అనుకుంటారు."

"అవును. నేనేసాకితే యెక్కడో దొంగతనంగా కని యిన్నాళ్లు దాచి యిప్పుడు స్నేహితులకొడు కంటుందని అనుమానిస్తుంది లోకం." అని అనుకుంది వసుంధర మనసులో.

మరునాడుసాయంత్రం స్కూలునుంచి వొస్తోంటే తోవలో అవుపడ్డాడతడు. వొహ పొగడచెట్టుకి వొరిగి రాజులాగా కాలుమీద కాలేసుకొని కూచొని పాటపాడుతోన్నాడు. ఆపాటకి అర్థంలేకపోయినా ఆధ్వనిలో మాధుర్యం వుంది. వసుంధరని చూడ్డంతోటే లేచి పరుగెత్తబోయాడు. కాని వసుంధర దయతో ఆగమని సంజ్ఞచేసింది. ఆగి ఆమెవేపొచ్చాడు మెల్లిగా. ఆసిపాయికోటుని వసుంధరకోసం త్యాగంచేసి ఆచింపులమర్రుతోటే లక్ష్యం లేకుండా తిరుగుతోన్నాడు. ఆమెకి జాలేసింది. తనవెంట రమ్మని సంజ్ఞచేస్తో యింటిదాకా తీసికెళ్లింది. పిల్లికూనలాగా ఆమెవెంట వెళ్లాడు "తార, తార" అంటో. వసుంధర లోపలికెళ్లి వారంరోజులకింద కొత్తగా కుట్టించుకున్న వొవరుకోటు తెచ్చి ఆతని కిచ్చి తొడుక్కోమంది. అది వాడు మురుస్తో తొడుక్కున్నాక వొహ రూపాయిడబ్బులు తెచ్చి ఆతనికిచ్చి పొమ్మంది. ఆతని సంతోషం మీరిపోయి రోడ్లో నాట్యం చేయటం మొదలెట్టాడు. అప్పుడే రాజులాగా గాంభీర్యంతో నడుస్తాడు; అప్పుడే బఫూన్‌లాగా గంతు లేస్తాడు. మోటార్లహార్ను, బండివాళ్ల కేకలూ ఆతనికి వినపడవు.

ఒహాయిరవై అడుగులు యిట్లా నడిచేటప్పటికి జువ్వు మని సార్జెంటుకారొహాటి యెదురుగుండా వొచ్చి ఢీకొన్నది. గుమ్మంలోనుంచొని ఆతురతతో చూస్తోన్న వసుంధర కళ్లు మూసుకుంది. రెండునిమిషాలతరువాత మా నేసరికి జనులంతా గుమిగూడారు. జ్ఞానం లేకుండా యీ దేశంవాళ్లంతా రోడ్లో తిరుగుతారని దుమికి కారుతోలుకోవెళ్లి పోయాడు సార్జెంటు. ఆతడు మధ్య రోడ్లో చచ్చిపడ్డాడు. వసుంధరదృష్టిని ఆకర్షించిన మెలికలు తిరిగిన ఆజుట్టూ, తీర్చిన కనుబొమ్మలూ, చక్కని ముఖ్కూ చిదిగి రక్తలీనమైపోయాయి. తలమీదుగానే వెళ్లించె కారు. రెండు నిమిషాలకుము ందేవసుంధర యిచ్చిన అణాబిళ్లలన్నీ చెల్లాచెదరై పడ్డాయి. ఆకోటు గుమ్మంలో దొర్లిపోయింది. ఆమె మెల్లిగావొచ్చి యీజీ చేర్లో పడిపోయింది. ఒహగంటతరువాత పనిమనిషి వొచ్చి టీ చల్లారిపోతోం దంటే దాన్నే తాగేయమంది. వాడిమృత్యువుకి కారణంఅంతా తనే అనే బాధతో దహించుకోపోయింది.

దీపాలుపెట్టాక పరుగెత్తుతో యెగదమ్ముతో కృష్ణమూర్తి వొచ్చాడు. ఎదురుగా నుంచున్న వసుంధర అవుపడ్డంతోటే పెళ్లున నవ్వాడు. 'ఏమి' అన్నట్టు ఆవేపు చూసింది వసుంధర.

"రేపు నన్ను. మీతో తీసికెడ్తారా ఆకొత్తవూరికి ?"

"ఏం ?"

"మాఅమ్మమ్మ అడగమంది."

"నిజంగా నాదగ్గిర వుండాలనివుందా నీకు?

చప్పున ఆమె నడుంచుట్టూ అల్లుకొని వ్రేలాడపడ్డాడు. వసుంధర కుర్చీలోకూచొని ఆతన్ని దగ్గిరకి లాక్కుంది. ఉంగరాలుగా మెలికలు తిరిగిన ఆ క్రాపును తన వేళ్లతో దువ్వింది. చప్పున ఆతని ఆతీర్చిన కనుబొమ్మల్ని, ముక్కుని ముద్దెట్టుకొని ఆతనితల తన వక్షానికి అదుముకుంది. ఆమెకళ్లంబడి రెండు నీటిధారలు చెంపలమీదుగా జారాయి. ఒక్కనిమిషం తరువాత ఆతన్ని వొదిలి "వెళ్లు. మీఅమ్మమ్మతో చెప్పి రేపుపొద్దున్నే రా. ఏం ?"

"వొచ్చేప్పుడు మాపెరంట్లో గన్నేరుపూ లున్నాయి, తేనా ?"

"పూ లేకాదు, వొహ చిన్ని మొక్క వుంటే తీసుకోరా."

"చాలా వున్నాయి."

"వొహాటి పట్టుకోరా, ఆ వూళ్లో నాటుకుందాం."

"వసుంధర కుర్చీలో......ఆతనితల తనవక్షానికి అదుముకుంది."